సాక్షి రంగారెడ్డి

బుధవారం, 19, ఫిబ్రవరి, 2025



ఆపరేషన్ కోసం వస్తే..

కు.ని. ఆపరేషన్‌కోసం ఆస్పత్రికి వస్తే ప్రాణమే పోయింది. కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. 8లో ▸



గోల్డ్ లోన్ పేరిట గోల్‌మాల్

గోల్డ్ లోన్, చిట్టీల పేరుతో అందిన కాడికి దండుకొని ఉడాయించిన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో ▸



న్యాయం చేయండి

భర్త మృతితో పుట్టెడు దుఃఖంలో ఉంటే.. మానసికంగా వేధిస్తున్నారని ఓ మహిళ ఆందోళనకు దిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

‘ఉపాధి’లో వేగం పెంచండి



తిప్పాయిగూడలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

మంచాల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో వేగం పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆమె ఉపాధిహామీ పనులు, వాటర్ షెడ్ పథకం పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు కావాల్సిన గోతులను సకాలంలో తీయించాలని తెలిపారు. వ్యవసాయ పొలాలు, పొలం గట్లపై, ప్రభుత్వ భవనాల ఆవరణలో, రోడ్లకు ఇరువైపులా నాటడానికి గోతులు తీయించాలని సూచించారు. అవసరమైతే కూలీల సంఖ్య పెంచాలన్నారు. మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండలకు చనిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, వాటర్ షెడ్ ఏపో సంధ్య, ఏపీఓ వీరాంజనేయులు, టీఏలు మహేశ్, శేఖర్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

నందనవనం హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సరూర్‌నగర్ మండలం నందనవనం మండల ప్రజా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజితపై సస్పెన్షన్ వేటు పడింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా స్కూల్ ఆవరణలో మాజీ కార్పొరేటర్, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటినందుకు గానూ ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీసీఎస్ – 1964 ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు చేపట్టడానికి వీల్లేదని అన్నారు. ఈ మేరకు ఒక రాజకీయ నాయకుడి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుందని పేర్కొన్నారు.

దుర్గం చెరువు పరిరక్షణకు జలమండలి చర్యలు



దుర్గం చెరువు వద్ద జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టనుంది. మంగళవారం చెరువు పరిసరాలను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, లేక్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర విభాగాల అధికారులు పరిశీలించారు. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, గార్డెనింగ్, ల్యాండ్ స్కేపింగ్ అవసరాల కోసం ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటినే వినియోగించే విధంగా చర్యలకు ఉపక్రమించారు. మాదాపూర్, సైలెంట్ వ్యాలీ ప్రాంతాలు, క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉత్పన్నమవుతున్న మురుగు నీటిని దుర్గం చెరువులో నిర్మించిన రెండు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం దుర్గం చెరువు భూగర్భ నీటి మట్టం పెరిగేందుకు, ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని చెరువులోకి వదిలి వేస్తున్నారు. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా 1000 ఎంఎం డయా పైపులైన్‌ను మాదాపూర్ పెట్రోల్ బంక్ నుంచి మాదాపూర్ ఐ–డి వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. వర్షాకాలంలో వచ్చే వరద నీరు చెరువులో కలవకుండా వాటర్ డ్రైయిన్ సైతం నిర్మించనున్నారు. దుర్గం చెరువు పరిసరాల నివాసాల నుంచి వచ్చే సిల్ట్ డైవర్షన్ మెయిన్‌లో కలకుండా.. సిల్ట్ చాంబర్లు నిర్మించుకోవాలని వారికి నోటీసులు జారీ చేసేందుకు జలమండలి సిద్ధమవుతోంది. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, పార్కు, ల్యాండ్ స్కేప్ నిర్వహణ, ఇతర అవసరాలకు తప్పనిసరిగా వంద శాతం రీసైకిల్ వాటర్‌నే వినియోగించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు సీజీఎం పద్మజ, ఓఎస్డీ సత్యలింగం, జీహెచ్‌ఎంసీ జడ్సీ ఉపేందర్ రెడ్డి, డీసీ ముకుంద్ రెడ్డి, ఈఈ దుర్గా ప్రసాద్, ఈఈ(లేక్స్) నారాయణ, ఎలక్ట్రికల్, ఫిషరీస్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



814.68 చ.కి.మీ. 2,01,318 ఎకరాలు!

ఫ్యూచర్ సిటీ స్వరూపమిదీ

- ఏడు మండలాలతో ప్రత్యేక అథారిటీ ప్రతిపాదన
- ఈ పరిధిలో 56 రెవెన్యూ గ్రామాలు
- ప్రభుత్వం చెంతకు నివేదిక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్ సిటీకి ప్రభుత్వం బాటలు వేస్తోంది. 814.68 చదరపు కిలో మీటర్లు, 2,01,318 ఎకరాల విస్తీర్ణంలో భవిష్యత్ నగరి విస్తరించనుంది. ఫోర్త్ సిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడు మండలాలు, 56 రెవెన్యూ గ్రామాలతో ప్రత్యేక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాలను ఈ అథారిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. నాగార్జునసాగర్, బెంగళూరు హైవేలు, ఇటు ఔటర్‌రింగ్‌రోడ్డు, మరోవైపు ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు లోపలి గ్రామాలు ఈ అథారిటీ పరిధిలోకి రానున్నాయి. కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేట కేంద్రంగా ఏర్పాట్లు చేస్తున్న ఈ పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ) పరిధిలో 1,31,733 జనాభా ఉంటుంది.

ప్రత్యేక మాస్టర్ ప్లాన్

ఫోర్త్‌సిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్కారు ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కృత్రిమ మేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, క్రికెట్ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించాలని యోచిస్తోంది. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రతిబంధకాలు రాకుండా, అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చకచకా సాగేలా ప్రత్యేకంగా అథారిటీ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను కూడా రూపొందించనుంది.

అథారిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలివీ..

ఆమనగల్లు మండలం: కోనాపూర్, రాంనూతల
ఇబ్రహీంపట్నం: కప్పపహాడ్, పోచారం, రాంరెడ్డిగూడ, తులేకలాన్, తుర్కగూడ, ఎలిమినేడు, ఎర్రకుంట, తడ్లకాల్వ
కడ్తాల్: చరికొండ పట్టికల్వకుర్తి, చరికొండ పట్టిపడ్కాల్, ఎక్రాజ్‌గూడ, కడ్తాల్, కర్కల్ పహాడ్, ముద్విన్
కందుకూరు: దాసర్లపల్లి, అన్నోజిగూడ, గూడూర్, దెబ్బడగూడ, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూర్, గఫూర్‌నగర్, లేమూర్, మాదాపూర్, మీర్‌ఖాన్‌పేట్, మహ్మద్‌నగర్, ముచ్చర్ల, పంజగూడ, రాచులూర్, సర్వరావులపల్లి, తిమ్మాయిపల్లి, తిమ్మాపూర్
మహేశ్వరం: మహబ్బత్‌నగర్, తుమ్మలూర్
మంచాల: ఆగపల్లి, నోముల, మల్లికార్జునగూడ
యాచారం: చౌదర్‌పల్లి, గుంగల్, కొత్తపల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, మొగుళ్లవంపు, నక్కర్త, నానక్‌నగర్, నందివనపర్తి, నస్దిక్ సింగారం, తక్కెళ్లపల్లి, తాటిపర్తి, తులేకుర్ద్, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి

మహేశ్వరం: యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కోసం సైనికుల్లా కష్టపడి పని చేయాలని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్టుపల్లి గ్రామంలోని కోరుపోలు చంద్రారెడ్డి రిసార్ట్స్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పని చేస్తే పదవులు వరిస్తాయన్నారు. ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పని చేసిన వారు దేశంలో వివిధ రాష్ట్రాలకు సీఎంలు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజలకు తెలియజేయాలన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ పార్టీ సంస్కరణలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. యూత్ కాంగ్రెస్‌ను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులంతా ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న ప్రతి అంశాన్ని కింది స్థాయి కార్యకర్తలకు వివరించాలన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి శిక్షణ పూర్తి చేసుకున్న యువజన కాంగ్రెస్ నాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఏఐసీసీ సభ్యురాలు కోట నీలిమా, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి, పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వంశీచందర్‌రెడ్డి



విద్యార్థులతో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

లక్ష్యాన్ని ఎంచుకుని చదవండి

మంత్రి పొన్నం ప్రభాకర్

హయత్‌నగర్: విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని ఎంచుకుని, సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని, ఇందుకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేఎల్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్పిరేషన్ అండ్ ఇగ్నేషన్ కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మునుగనూరులోని మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నత స్థాయిలో ఉన్న అనేక మంది ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకున్న వారేనని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రపంచ మేధావులుగా ఎదిగేందుకు ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ అవసరమని గ్రహించిన ప్రభుత్వం ఇటీ వలే మెస్ చార్జీలు పెంచిందని తెలిపారు. కేఎల్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యాలయాలను నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యాలయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, జేఆర్‌పీ గురుకుల విద్యాలయాల సెక్రెటరీ సైదులు, జాయింట్ సెక్రెటరీ తిరుపతి, పాఠశాల ప్రిన్సిపాల్ జానకి రాములు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్మెంటరీ, వాష్ రూమ్స్, వంట సామగ్రి, ఆహార పదార్థాలు, బెడ్స్‌తోపాటు హాస్టల్ మొత్తాన్ని పరిశీలించారు. విద్యాబోధన, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్ గదుల్లో, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా ఉదయం, సాయంత్రం శుభ్రం చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు విద్యార్థినులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు, ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సాగర్, కేజీబీవీ స్పెషలాఫీసర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



ర్యాలీలో అభివాదం చేస్తున్న కేటీఆర్

బీఆర్‌ఎస్ జోష్

- రైతు దీక్షకు తరలివచ్చిన జనం
- ఆమనగల్లులో కేటీఆర్ భారీ ర్యాలీ
- విజయవంతమైన కార్యక్రమం
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో మంగళవారం నిర్వహించిన రైతు దీక్ష సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజీవ్ చౌరస్తా నుంచి దీక్ష శిబిరం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో కేటీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వేదికపైకి చేరుకోగానే సీఎం.. సీఎం అంటూ నినాదాలు హోరెత్తాయి. దీక్షలో అరగంటపాటు మాట్లాడిన ఆయన తన వాగ్ధాటితో ఆకట్టుకున్నారు.

సమస్యలు పట్టించుకోవడం లేదు

పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నాడు తప్పితే రాష్ట్ర సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాతే పాలమూరు జిల్లాకు సాగునీరు అందిందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంప వెంకటేశ్, దశరథ్‌నాయక్, పత్యానాయక్, జీఎల్‌ఎన్‌రెడ్డి, ఎడ్మ సత్యం, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, నిర్మల శ్రీశైలంగౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల ప్రదర్శన

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

బీఆర్‌ఎస్ ర్యాలీలో ప్రదర్శించిన కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. డప్పు, డోలు కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. వేదిక వద్ద కళాకారుల ఆటపాటలు హోరెత్తించాయి. కేటీఆర్‌కు అభిమానులు నాగలి, సేవాలాల్ చిత్రపటాలను బహూకరించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని మంగళవారం మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజ్, మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలి పంతునాయక్‌లు కేటీఆర్‌ను ఘనంగా సన్మానించారు.



రైతుదీక్షకు హాజరైన ప్రజలు

ఆడపిల్లలు ఉన్నతంగా రాణించాలి

కేజీబీవీ ప్రత్యేకాధికారి ఆశాలత

తాండూరు రూరల్: ఆడపిల్లలు సైతం అన్నిరంగాల్లో రాణించాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి ఆశాలత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జినుగుర్తి గేట్ వద్ద ఉన్న కేజీబీవీ హాస్టల్లో ‘బేటీ బచావో– బేటీ పడావో’ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలత మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని పైలెట్లుగా, నౌకాదళాల్లోనూ ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. అనంతరం పెద్దేముల్, తాండూరు, యాలాల, బషీరాబాద్ కేజీబీవీ జట్లు కబడ్డీ, ఖోఖో పోటీల్లో తలపడ్డాయి. ఈ పోటీల్లో యాలాల ప్రథమ స్థానం సాధించగా, పెద్దేముల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారిత కేంద్ర అధికారులు వరలక్ష్మి, రాందాస్, ప్రత్యేకాధికారులు రాజేశ్వరి, మంగమ్మ, పీడీలు అనంత య్య, బుగ్గప్ప, రాము, పీఈటీ వసుంధర, గోపిక, రజిత, శ్రీలత, బాలమణి, నందు పాల్గొన్నారు.



బేటీ బచావో– బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు

చేను.. చీర కాపాడేను

రైతులకు పంటలు వేయడం ఒక ఎత్తైతే.. వాటిని రక్షించుకోవడం మరో ఎత్తు.. ఆరుగాలం పండించిన పంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంటారు.. రాత్రి వేళ చేలలోకి అడవి పందులు, కుందేళ్లు వచ్చి నాశనం చేస్తుంటాయి.. వీటి నుంచి పంటలను రక్షించుకోవడాకి మొయినాబాద్ మండలం వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు మొక్కజొన్న పంట చేను చుట్టూ ఇలా చీరలు కట్టారు. చేనుకు అడ్డంగా చీరలు కట్టడంతో అడవి పందులు, కుందేళ్లు వాటిని దాటుకుని లోనికి వెళ్లలేవని రైతుల ఆలోచన.

– మొయినాబాద్





గోల్డ్ లోన్ పేరిట గోల్‌మాల్

- చిట్టీల పేరుతో టోకరా
- అందినకాడికి దండుకుని పలాయనం
- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ విజయ్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: అమాయకులను ఆసరాగా చేసుకున్నాడు.. మాయమాటలు చెప్పాడు.. చిట్టీల వ్యాపారం, గోల్డ్ లోన్ పేరుతో రూ.కోట్లు వసూలు చేశాడు.. అందిన కాడికి దండుకొని ఉడాయించాడు.. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు.

వసూలు చేసి.. ఉడాయించి

పట్టణానికి చెందిన అవుసుల నరేష్ 2023లో టౌన్‌లోని పరిగి రోడ్‌లో అంకిత్ జ్యువెలరీ పేరుతో బంగారం షాపు ప్రారంభించాడు. కొంతకాలం తరువాత శ్రీలక్ష్మీనర్సింహ పేరుతో గోల్డ్ సేవింగ్ స్కీంకు తెర తీశాడు. అమాయకులకు మాయమాటలు చెప్పి వారి నుంచి నెలకు రూ.1000 వసూలు చేశాడు. అదే పంథాలో చిట్టీల వ్యాపారం ప్రారంభించాడు. బంగారు వస్తువులు తయారు చేస్తానని తెలిసిన వారి నుంచి రూ.కోటి వరకు దండుకొని కనపడకుండా పోయాడు.

బాధితుల ఫిర్యాదుతో..

బాధితులు 2024 సెప్టెంబర్ 2న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి గోల్డ్ లోన్‌కు సంబంధించిన బుక్కులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఐ శివారెడ్డి సిబ్బంది మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కడ్తాల్: చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని పల్లెచెలకతండాలో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. పల్లెచెలకతండాకు చెందిన జర్పుల మంగమ్మ, బీచ్యా భార్యాభర్తలు. ఈ నెల 3న ఉదయం కూలి పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. కాసేపటికి వారి పిల్లలు ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లారు. అదే తండాకు చెందిన జర్పుల కుమార్ ఇదే అదునుగా భావించి అక్కడే ఉన్న తాళం చెవితో ఇంటి తాళాలు తీసి బీరువాలో దాచి ఉంచిన నగదు ఎత్తుకెళ్లాడు. మరుసటి రోజు ఉదయం బీచ్యానాయక్ దంపతులు బీరువా తెరిచి చూడగా డబ్బులు కనిపించలేదు. బీరువాలో దాచి ఉంచిన రూ.1.10 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించి కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నిందితుడు జర్పుల కుమార్

ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు జర్పుల కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. చోరీకి పాల్పడిన రూ.1.10 లక్షల్లో రూ.10 వేలు ఖర్చు చేయగా, రూ.లక్షను నిందితుడి నుంచి రికవరీ చేశారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం ఆమనగల్లు కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఆపరేషన్ కోసం వస్తే..
ఆయువే పోయింది



ఆస్పత్రి గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

- వైద్యం వికటించి మహిళ మృతి
- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన

చేవెళ్ల: కు.ని. ఆపరేషన్‌కోసం ఆస్పత్రికి వస్తే ప్రాణమే పోయింది. కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండలం గుండాల గ్రామానికి చెందిన యాదగిరి కూతురు మమత (25)ను వికారాబాద్ జిల్లా పూడూరు మండలం అంగడి చిట్టెంపల్లి గ్రామానికి చెందిన సుంచు శ్రీశైలంకు ఇచ్చి ఐదేళ్ల కిత్రం వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు మూడేళ్ల పాప, 13 నెలల బాబు ఉన్నారు. ఈనెల 11న మమత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ జనరల్ ఆస్పత్రిలో చేరారు. అక్కడి వైద్యులు ఆపరేషన్ చేశారు. శనివారం స్వల్పంగా జ్వరం రావడంతో చికిత్స అందించారు. ఆదివారం తీవ్రత పెరగడంతో పరిస్థితి విషమంగా మారింది. సరిగా పట్టించుకోవడం లేదని కుటుంసభ్యులు వైద్యుల తీరుపై మండిపడి మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది.



మమత (ఫైల్)

సరైన వైద్యమే అందించాం

కు.ని.ఆపరేషన్ కోసం వచ్చిన మమతకు ఆపరేషన్ చేశాం. నాలుగురోజుల వరకు బాగానే ఉంది. శనివారం అకస్మాత్తుగా జర్వం రావటంతో పాటు బీపీ పడిపోయింది. అప్పటికీ చికిత్స అందిస్తున్నాం. కుటుంబ సభ్యులే గొడవ పడి మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. మా ఆస్పత్రిలో సరైన వైద్యమే అందించాం. వైద్యుల నిర్లక్ష్యం లేదు.

– రామకృష్ణారెడ్డి, పీఎంఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆస్పత్రి ఎదుట ఆందోళన

మమత మృతికి పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంతో ఆస్పత్రి గేట్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొంతమంది నాయకులు బాధితులకు న్యాయం చేయాలని ఫోన్‌లో యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. మృతురాలికి మరో ఆస్పత్రిలో అయిన వైద్య ఖర్చులు రూ.4 లక్షలతో కలిపి మొత్తం రూ.20 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం.

వాషింగ్ మిషన్‌లో దుస్తులు వేస్తుండగా విద్యుత్ షాక్

అక్కడికక్కడే బాలిక మృతి



ఫాతిమ మృతదేహం

పహాడీషరీఫ్: విద్యుద్ఘాతంతో మైనర్ బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్ అలీనగర్‌కు చెందిన షానవాజ్ కుమార్తె ఫాతిమ (17) సోమవారం రాత్రి 9 గంటలకు వాషింగ్ మిషన్‌లో దుస్తులు వేస్తుండగా తేలి ఉన్న వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వైర్లు తొలగించి పరిశీలించగా అప్పటికే బాలిక మృతి చెందింది. ఈ ఘటనపై 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

108 అంబులెన్స్ సేవల తనిఖీ

శంషాబాద్ రూరల్: జిల్లా 108 సేవల కో ఆర్డినేటర్ రాజబాబు మంగళవారం శంషాబాద్‌లోని 108 అంబులెన్స్ సేవలను పరిశీలించారు. అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, అత్యవసరం సమయంలో అందించే మందులను తనిఖీ చేశారు. ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర కేసుల్లో జాగ్రతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

200 మంది పిల్లలకు 'వినికిడి లోపం' చికిత్సలు

సాక్షి, సిటీబ్యూరో: వినికిడి సమస్యతో బాధపడుతున్న 200 మంది పిల్లలకు ఉచితంగా అత్యాధునిక శస్త్ర చికిత్సలు నిర్వహించామని రావూస్ ఈఎన్‌టీ ఆస్పత్రి డైరెక్టర్ శ్రీరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం దేశంలోనే మొదటిసారి ఆసియా పసిఫిక్ అడ్వాన్స్‌డ్ కాంక్లియర్ ఇంప్లాంట్ కాన్ఫరెన్స్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టగానే వినికిడికి సంబంధించిన బెరా పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే శస్త్ర చికిత్సలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. కాంక్లియర్ ఇంప్లాంట్‌లో రిమోట్ ప్రోగ్రామింగ్ అనే కొత్త టెక్నాలజీని పరిచయం చేస్తున్నట్లు వివరించారు.

న్యాయం చేయండి

- మానసికంగా వేధిస్తున్నారు
- భర్త మృతితో వచ్చిన ఆర్థిక సాయం లాగేసుకున్నారు
- పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళ ధర్నా
- యాచారం పోలీసులకు ఫిర్యాదు

యాచారం: భర్త మృతితో పుట్టెడు దుఃఖంలో ఉంటే.. మానసికంగా తీవ్రంగా వేధిస్తున్నారని, భర్త మృతితో ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులను కూడా లాగేసుకున్నారని.. న్యాయం చేయాలని ఓ మహిళ యాచారం పోలీసులకు ఆశ్రయించింది. వివరాలివీ.. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీరాములు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఇంజాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గత ఏడాది మే 24న మంచాల మండల పరిధిలోని రంగాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్పలత, శన్ముకవల్లభ, కుమార్తె విద్యావాసిని ఉన్నారు. శ్రీరాములు మృతి అనంతరం అతని కుటుంబ సభ్యుల నుంచి పుష్పలతకు సహకారం లేకుండా పోయింది. శ్రీరాములు మృతితో ప్రభుత్వం నుంచి అందిన ఆర్థిక సాయాన్ని కూడా పుష్పలతకు ఇవ్వకుండా వారే తీసుకున్నారు. వారసత్వ పరంగా రావాల్సిన ఆస్తులు, డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పుష్పలత తన పిల్లలతో కలిసి న్యాయం చేయాలని ఐద్వా జిల్లా కమిటీ, సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నల్లవెల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. అనంతరం చట్టపరంగా తనకు రావాల్సిన డబ్బు, ఆస్తి ఇచ్చే విధంగా చూడాలని యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుష్పలతకు మద్దతుగా సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో కలిసి యాచారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పుష్పలత

'నక్ష'.. శాశ్వత రక్ష

- ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలకు భద్రత
- ప్రతీ స్థలానికి యూనిక్ నంబర్
- అణువణువూ డిజిటల్ రూపంలో నిక్షిప్తం
- పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ మున్సిపాలిటీ



కొడంగల్: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 152 మున్సిపాలిటీల్లో పైలెట్ ప్రాజెక్టుగా నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్ష) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకు రాష్ట్రంలోని పది మున్సిపాలిటీలను ఎంపిక చేసింది. అందులో వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపాలిటీ ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో తొలిదశలో కొడంగల్‌ను ఎంపిక చేశారు. మంగళవారం కొడంగల్‌లో నక్ష పైలెట్ ప్రాజెక్టు సర్వేను జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ సుధీర్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ సభ్యుడు సుధీర్ గోలి, సర్వే ఆఫ్ ఇండియా ఆఫీసర్ సమీరుద్దీన్, డిప్యూటీ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉమా మహేశ్వర్‌రావు, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తదితరులు పాల్గొని సర్వేను అధికారికంగా ప్రారంభించారు.

మూడు పద్ధతుల్లో ఏరియల్ సర్వే

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఇళ్ల భవనాలు ఇతర నిర్మాణాల పూర్తి వివరాలను జియో స్పేషియల్ సాంకేతితతో సేకరిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రతీ స్థలంలోని అణువణువు డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయనున్నట్లు చెప్పారు. ఇండ్లు భవనాల విస్తీర్ణం, ఎత్తు, సర్వే నంబర్, యజమాని పేరు, ఇతర వివరాలతో ప్రాపర్టీ కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. పక్కాగా రెవెన్యూ రికార్డులు, ఆస్తి పన్ను నిర్ణయం, వసూళ్లలో పారదర్శకత ఉంటుందన్నారు. ఇళ్లు, స్థలాల వివాదాలకు పరిష్కారం చూపనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో అభివృద్ధి ప్రణాళికలకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. హెలికాప్టర్ ఏరియల్ సర్వే సిబ్బంది మాట్లాడుతూ.. మూడు పద్ధతుల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. డ్రోన్లు, హెలికాప్టర్లు, చిన్న పాటి విమానాలకు ప్రత్యేక కెమెరాలను అమర్చి సర్వే చేయడానికి అనుమతి ఉందన్నారు. కొడంగల్‌లో హెలికాప్టర్ ద్వారా సర్వే చేయనున్నట్లు చెప్పారు. గాలిలో ఎగురుతూ హెలీకాప్టర్ ద్వారా ఫొటోలు తీస్తామని వివరించారు. ప్రతి ఫొటోకు ఐడెంటిటీ నంబర్ ఉంటుందని.. ఈ సర్వేలో భూమిపైన ఉన్న నిర్మాణాలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ ద్వారా అందుతాయని చెప్పారు. సర్వే నంబర్, ఇంటి నంబర్, విస్తీర్ణం, యజమాని పేరు తదితర వివరాలతో ఫొటోలు వస్తాయన్నారు. ఈ సమాచారం మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంబంధిత స్థలాల వద్దకు వెళ్లి విచారణ జరిపిస్తారని, తదనంతరం యజమానికి ప్రాపర్టీ కార్డు వస్తుందన్నారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు ఇళ్ల స్థలాల వివాదాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేకు ఆదేశించిందని వివరించారు. అనంతరం సర్వే సిబ్బంది మున్సిపల్ పరిధిలో సర్వే చేయడానికి హెలీకాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

'కమాండ్' తప్పిందా?

- ఐసీసీసీలోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించడంపై పోలీస్ వర్గాల్లో చర్చ
- ముమ్మాటికీ భద్రతా వైఫల్యమే అని విమర్శలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)కు ఇటీవల కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాలకు హాజరవుతున్నారు. ఇంతటి కీలకమైన ఐసీసీసీలోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి.. టాస్క్‌ఫోర్స్ పోలీసునంటూ తిరగడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఐసీసీసీలోకి ఎవరు వెళ్లాలన్నా చెకింగ్ పాయింట్‌లో అన్ని వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు కూడా చూపించాలి. ఎవరిని కలవాలో చెప్పాలి. నకిలీ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ఐసీసీసీలోకి మూడుసార్లు వెళ్లి రావడం పట్ల పోలీసులు ఆరా తీస్తున్నారు. లోపలికి ఎలా వచ్చాడు ఎవరిని కలిశాడు, ఏం చెప్పి వచ్చాడు అన్నదానిపై ఉన్నతాధికారులు, నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. కూకట్‌పల్లికి చెందిన జ్ఞాన సాయి ప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఎదురుగా ఉన్న నిలోఫర్ కేఫ్‌లో కలుసుకున్న నకిలీ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్..తన పేరు హరిజన గోవర్ధన్‌గా పరిచయం చేసుకొని హోటల్ బిజినెస్‌లో లాభాలు వస్తాయంటూ రూ.2.82 లక్షలు వసూలు చేశాడు. మూడు విడతలుగా ఇదే హోటల్‌లో బాధితుడు చెల్లించడం జరిగింది. ఈ మూడుసార్లు నిందితుడు హరిజన గోవర్ధన్ ఐసీసీసీ నుంచి బయటికి వచ్చి బాధితుడిని నమ్మించాడు. బాధితుడు కూడా నేరుగా కమాండ్ కంట్రోల్‌సెంటర్ నుంచి సదరు వ్యక్తి వస్తుండటంతో అందులో పని చేస్తున్న వ్యక్తిగానే భావించాడు. ఇక్కడే బాధితుడు దెబ్బతిన్నాడు. అడిగినంత డబ్బు చెల్లించుకొని తీరా మోసపోయిన తర్వాత బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐసీసీసీలో సీసీ ఫుటేజీలు పరిశీలించగా నిందితుడు మూడుసార్లు రావడం పోలీసులు గుర్తించారు. ఇంతటి కీలకమైన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకి అది కూడా సీఎం రోజూ హాజరవుతున్న ప్రాంతంలోకి నకిలీ పోలీసు వెళ్ళడం దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికకారులు లోతుగా విచారిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి మరింత సమాచారం రాబడుతున్నారు. గతంలో నిందితుడు ఇలాంటి మోసాలకు పాల్పడి ఉంటాడా..అనే కోణంలో కూడా పాత నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టారు. మొన్నటికి మొన్న సచివాలయంలో నకిలీ అధికారులు సంచలనం సృష్టించగా తాజాగా సీఎం సమీక్షలకు వస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది.

తైవాన్ కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్

ముఠా సభ్యుల్లో ముగ్గురి అరెస్టు



పట్టుబడ్డ క్రికెట్ బుకీలతో పోలీసులు

అమీర్‌పేట: తైవాన్ కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠా సభ్యులను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. తైవాన్ దేశానికి చెందిన ప్రధాన బుకీ గ్రెగరీ నగరంలో ఉండే ముగ్గురు వ్యక్తుల ద్వారా అన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా రామగుండం మండలం ఎల్కపల్లికి చెందిన లింగాల అర్జున్ రాజ్, మాదాపూర్‌లో ఉండే అర్జున్ సోదరుడు లింగాల సాకేత్, పెద్దపల్లి మండలానికి చెందిన మేకల సంజయ్ ఎస్ఆర్‌నగర్ బీకేగూడ జయప్రకాష్‌నగర్‌లో ఉంటూ క్రికెట్ బుకీలుగా వ్యవహరిస్తున్నారు. అర్జున్ రాజ్ ఇన్‌స్టాగామ్‌లో 'క్రికెట్ 360 మీడియా' ఐడీని క్రియేట్ చేసి క్రికెట్ రిలేటెడ్ మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెడతారు. ముగ్గురు కలిసి బెట్టింగ్‌లు కట్టే వారి నుండి హైపర్ టూల్ అనే యాప్ ద్వారా ఖాతాదారుల నుండి డబ్బులు డిపాజిట్ చేయిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు ఆ ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 15 మొబైల్ ఫోన్లు,7 ల్యాప్‌టాప్‌లు,10 వరకు బ్యాంకు అకౌంట్స్‌లో ఉన్న రూ.4 లక్షల 73 వేల 508 రూపాయల డిపాజిట్లు స్వాధీనం చేసుకున్నారు. ఖాతాదారుల అనుమతి లేకుండా పొందిన నకిలీ సిమ్ కార్డులతో టీఎంటీ నెట్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు జరిపి అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తైవాన్‌కు చెందిన గ్రెగరీతో పాటు మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న 'నవ వాజ్య రంజని'



కళాకారులకు మంగళశాసనాలు అందజేస్తున్న చిన జీయర్‌స్వామి



వయోలిన్ వాయిస్తున్న చిన్నారులు

శంషాబాద్ రూరల్: శ్రీ భగవద్రామానుజులకు ఇష్టమైన తొమ్మిది అంకెను అనుసరిస్తూ 108 వయోలిన్స్, 18 రకాల సహకార వాయిద్యాలు, 54 మంది వాయిద్యకారులు, 162 కళాకారులతో నిర్వహించిన స్వరార్చన ఆకట్టుకుంది. సమతాకుంభ్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సమతా స్ఫూర్తి కేంద్రంలో శ్రీ భగవద్రామానుజ 'నవ వాజ్య రంజని'కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక సంగీతంలో వినియోగించే నగారా, డప్పు, కొమ్ము బూర ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళారత్న డాక్టర్ అశోక్ గురజాలె బృందం వేదోక్త స్వరాలతో చేసిన సంగీత కచేరి వినసొంపుగా సాగింది. కళాకారులను త్రిదండి చిన జీయర్‌స్వామి అభినందించి, మంగళాశాసనాలు అందజేశారు.